# నమస్తే తెలంగాణ
## భద్రాద్రి కొత్తగూడెం



# అర్హులందరికీ 'సంక్షేమ' ఫలాలు

- తప్పిదాలు లేకుండా సర్వేను పూర్తిచేయాలి
- క్షేత్రస్థాయి పరిశీలనలో ఖమ్మం కలెక్టర్ ఖాన్

ఖమ్మం/ ఖమ్మం రూరల్, జనవరి 20: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్.. అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరం, ఖమ్మం రూరల్ మండలంలో సోమవారం పర్యటించిన ఆయన.. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల కోసం జరుగుతున్న సర్వేను తనిఖీ చేశారు. అర్హులను గుర్తించేందుకు అనుసరిస్తున్న


సర్వేలో సిబ్బందికి సూచనలు చేస్తున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

విధానాలను, సర్వే బృందాలు ఇంటింటికీ తిరుగుతూ సేకరిస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించారు. తప్పిదాలకు తావులేకుండా సర్వేను, పరిశీలన ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. సర్వేలో తీసుకుంటున్న సమాచారం, వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించారు. సాగుకు యోగ్యంకాని భూముల వివరాలను అధికారులు నమోదు చేయాలని సూచించారు. సాగుకు యోగ్యంకాని భూములకు రైతుభరోసా వర్తించదని తెలిపారు. అర్హులందరికీ నాలుగు పథకాలు అందేవరకు ఎంపికల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు. ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, అదనపు డీఆర్డీవో నూరొద్దీన్, ఏడీఏ సరిత, ఖమ్మం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీవో ఎస్.కుమార్, వార్డు ఆఫీసర్ అర్చన, అధికారులు పాల్గొన్నారు.


జూలూరుపాడు: అర్హులకు పథకాలు వర్తింపజేయాలంటూ తహసీల్ ఎదుట ధర్నా చేస్తున్న నేతలు



చిట్టి రామవరం తండాను కార్పొరేషన్‌లో కలపొద్దంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు


పట్టణ పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలంటూ వైరాలో ధర్నా చేస్తున్న నేతలు

# ప్రభుత్వంపై ప్రజాగ్రహం

- కాంగ్రెస్ సర్కారు ఏడాది పాలనలోనే ప్రజల్లో వ్యతిరేకత
- గ్యారెంటీ హామీల విస్మరణ, సంక్షేమ పథకాల్లో కోతలపై వెల్లువెత్తుతున్న నిరసన
- ఎక్కడికక్కడ ఆందోళనలు చేస్తున్న సబ్బండ వర్గాల ప్రజలు
- పాల్వంచ, లక్ష్మీదేవిపల్లిలో ఆర్టిజన్లు, జూలూరుపాడులో రైతులు, వైరాలో పట్టణ పేదలు

**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజాగ్రహం పెల్లుబుకుతోంది. రేవంత్ సర్కారు ఏడాది పాలనలోనే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతోంది. గ్యారెంటీ హామీలను విస్మరించడం, పథకాల్లో కోతలు విధిస్తుండడం వంటి కారణాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సబ్బండ వర్గాల ప్రజలు ఎక్కడికక్కడ ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కూడా జిల్లా వ్యాప్తంగా ఆయా వర్గాల ప్రజలు, పలు పార్టీల నేతలు, వివిధ సంఘాల నాయకులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.**

**–పాల్వంచ/ లక్ష్మీదేవిపల్లి/ జూలూరుపాడు/ వైరా టౌన్, జనవరి 20**

విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తూ పాల్వంచ కేటీపీఎస్ గేటు ఎదుట, లక్ష్మీదేవిపల్లిలోని విద్యుత్ శాఖ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సర్కిల్ కార్యాలయం వద్ద ఆర్టిజన్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టిజన్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 20 నుంచి 24 వరకూ రిలే దీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ట్రాన్స్‌కో, జెన్‌కోల్లో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్ కార్మికులను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యుత్ సరఫరాను స్తంభింపజేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అలాగే సీపీఐ ఆధ్వర్యంలో జూలూరుపాడులో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించే గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని; రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే, జూలూరుపాడు ఎంఈవో కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లులను వెంటనే విడుదల చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కోడిగుడ్ల బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే, మున్సిపాలిటీల్లోనూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో


పాల్వంచ కేటీపీఎస్ గేటు వద్ద ధర్నాకు మద్దతు తెలుపుతున్న ఆర్టిజన్లు

వైరా మున్సిపల్ కార్యాలయం వద్ద వందలాదిమంది పేదలతో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. ఉపాధి హామీతో సంబంధం లేకుండా పట్టణ పేదలకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాలన ప్రారంభించిన ఏడాది దాటినా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. అనంతరం వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు.

# కాంగ్రెస్ నేతలను నిలదీయండి

- ప్రజా సంక్షేమ పథకాలు ఏవంటూ గ్రామాల్లో ప్రశ్నించండి
- సమాధానం ఇవ్వకపోతే 'స్థానిక' ఎన్నికల్లో బుద్ధిచెప్పండి
- బీఆర్ఎస్ టేకులపల్లి సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా
- పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి: హరిప్రియానాయక్

టేకులపల్లి, జనవరి 20: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటిపోయినా ప్రజలకు అందించిన పథకాలు ఏమీ లేవని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు విమర్శించారు. ఇచ్చిన హామీలు తప్పడం తప్ప.. అమలు చేసింది శూన్యమని దుయ్యబట్టారు. టేకులపల్లి వెంకట్యాతండా సమీపంలో లక్కినేని సురేందర్‌రావు ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన బీఆర్ఎస్ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్.. ఏడాది దాటినా వాటిని అమలు చేయడంలేదని విమర్శించారు. పైగా సంక్షేమ పథకాల్లో కోతలు పెడుతూ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. గత కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను రద్దు చేస్తూ ప్రజలను


బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న రేగా, చిత్రంలో హరిప్రియ

ఇబ్బంది పెడుతోందని ధ్వజమెత్తారు. అందుకని స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం గ్రామాల్లోకి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని, సరైన సమాధానం ఇవ్వకపోతే అదే ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. అలాగే, ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపికల పేరుతో అన్ని గ్రామాల్లోనూ కాంగ్రెస్ నాయకులు దుకాణాలు ఏర్పాటుచేస్తున్నారని ఆరోపించారు. ఆయా దుకాణాల కౌంటర్లలో అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. దీంతో అసలైన అర్హులకు పథకాలు అందకుండాపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలందరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చే అభ్యర్థుల గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. టేకులపల్లి మండలంలోని 36 పంచాయతీల్లోనూ, ఇల్లెందు నియోజకవర్గంలోని 138 పంచాయతీల్లోనూ విజయం సాధించాలని, దానిని పార్టీ అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, తాతా గణేశ్, అచ్చయ్య, బోడా బాలు, లాల్‌చంద్, కిషన్, రామ, భూక్యా లాలునాయక్, రవి, పూల్‌సింగ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# తెరుచుకున్న గురుకులం..

- మూడు రోజుల తర్వాత 'టి పాలెం సోషల్ వెల్ఫేర్'కు మోక్షం
- సామాన్లతో రోజంతా స్కూల్ బయట విద్యార్థుల పడిగాపులు
- అద్దె బకాయిలు చెల్లిస్తాం.. ఆరు నెలల్లో ఖాళీ చేస్తాం..
- గురుకులాన్ని సందర్శించిన జోనల్ ఆఫీసర్ స్వరూపరాణి

ఖమ్మం అర్బన్, జనవరి 20: గురుకులాల్లో జరుగుతున్న సంఘటనలు విద్యార్థులు, తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. గురుకులాల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న నిర్లక్ష్య ధోరణితో విద్యార్థులు క్షణక్షణం భయంభయంగా గడపాల్సిన పరిస్థితి దాపురించింది. తాజాగా ఖమ్మంలోని బొమ్మ ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంగా నిర్వహిస్తున్న తిరుమలాయపాలెం సోషల్ వెల్ఫేర్ గురుకులానికి తాళం వేయడం.. మూడు రోజుల తర్వాత తిరిగి తెరుచుకోవడం మరో నిదర్శనం. గత పదినెలలుగా అద్దె చెల్లించకపోవడంతో విసిగి వేసారిన భవన యజమానులు శనివారం తరగతి గదులకు తాళాలు వేసిన విషయం విదితమే. ఉన్నతాధికారుల జోక్యంతో సోమవారం మధ్యాహ్నానికి గానీ తాళాలు తెరుచుకోలేదు. భవనాన్ని ఖాళీ చేయాలని పలు దఫాలుగా నోటీసులు ఇచ్చినా స్పందన లేకపోవడంతో యజమానులు శనివారం గురుకులానికి తాళం వేశారు. సోమవారం ఉన్నతాధికారులు స్పందించి ఆరు నెలల్లో ఖాళీ చేస్తామనే హామీ ఇచ్చారు. దీంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. అప్పటివరకు విద్యార్థులు గురుకులం బయట పడిగాపులు కాయడం కాశారు.

## విద్యార్థుల పడిగాపులు..

సంక్రాంతి సెలవులు ముగిసిన అనంతరం ఈ నెల 18వ తేదీ శనివారం పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. నగరంలోని తిరుమలాయపాలెం సోషల్ వెల్ఫేర్ గురుకులానికి సంబంధించి పది నెలల అద్దె బకాయిలు, 13 నెలల కరెంట్ బకాయిలు పేరుకుపోవడంతో ఎన్నిసార్లు రాతపూర్వకంగా విన్నవించినా అధికారులు స్పందించలేదు. దీంతో భవన యజమానులు శనివారం లోపలికి తరగతి గదులకు వెళ్లేందుకు వీలులేకుండా తాళం వేశారు. గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది విజ్ఞప్తి చేయడంతో గేట్‌కు తాళం ఓపెన్ చేశారు. కానీ తరగతుల్లోకి వెళ్లేందుకు ఉన్న గ్రిల్స్ తాళం మాత్రం తెరవలేదు. శనివారం కేవలం పది మంది విద్యార్థులు మాత్రమే రావడంతో వారిని గ్రౌండ్‌ఫ్లోర్‌లోనే ఉంచారు. ఆదివారం కూడా విద్యార్థులు రాలేదు. సెలవుల అనంతరం సోమవారం విద్యార్థులను తీసుకుని తల్లిదండ్రులు అధికసంఖ్యలో వచ్చారు.


సామాన్లతో చెట్టు కింద వేచి ఉన్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


తాళాలు తీసిన అనంతరం లోపలికి వెళ్తున్న విద్యార్థులు

గ్రిల్స్‌కు తాళం వేసి ఉండడంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విద్యార్థులు స్కూల్ ముందే తమ సామాన్లతో ఎదురుచూసుకుంటూ ఉన్నారు.

## హామీతో తెరుచుకున్న తాళాలు...

ఇప్పటికే 30 నోటీసులు ఇచ్చామని, ఎప్పుడు ఖాళీ చేస్తారో రాతపూర్వకంగా ఇస్తేనే తాళం తీస్తామని భవన యజమానులు స్పష్టం చేశారు. దీంతో జోనల్ ఆఫీసర్ స్వరూపరాణి తిరుమలాయపాలెం గురుకుల కళాశాలను సందర్శించారు. జోనల్ ఆఫీసర్, గురుకుల ప్రిన్సిపాల్‌తో భవన యజమానులు చర్చలు జరిపారు. ఈ విద్యాసంవత్సరం అనంతరం భవనాన్ని ఖాళీ చేస్తామని హామీ ఇవ్వడంతో తాళాలు తెరిచారు. తరువాత విద్యార్థులను లోపలికి అనుమతించారు.

## తాతా మధును కలిసిన ఫ్లోర్ లీడర్లు

ఖమ్మం, జనవరి 20: ఇటీవల నూతనంగా ఎంపికైన బీఆర్ఎస్ కేఎంసీ ఫ్లోర్‌లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్‌లు బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధును, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను సోమవారం ఖమ్మంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్‌ను, డిప్యూటీ ఫ్లోర్ లీడర్‌ను తాతా, సండ్ర శాలువాలతో సత్కరించారు. బీఆర్ఎస్ నేతలు పగడాల నాగరాజు, బెల్లం వేణుగోపాల్, కట్టా అజయ్‌కుమార్, రుద్రాగాని ఉపేందర్, మాటేటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కేఎంసీ కమిషనర్‌కు ఫ్లోర్ లీడర్ల ఎంపికపత్రం

కేఎంసీ బీఆర్ఎస్ ఫ్లోర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా కర్నాటి కృష్ణ, షేక్ మక్బూల్‌లను ఎంపిక చేసుకున్నట్లు బీఆర్ఎస్ కార్పొరేటర్లు తెలిపారు. ఈ మేరకు వీరి ఎంపిక పత్రాన్ని బీఆర్ఎస్ కార్పొరేటర్లంతా కలిసి కేఎంసీ కమిషనర్ అభిషేక్‌కు సోమవారం కేఎంసీ కార్యాలయంలో అందజేశారు. అనంతరం కమిషనర్‌తో వారు మాట్లాడుతూ.. నగరంలోని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ షేక్ మక్బూల్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు బుడిగం శ్రీనివాస్, నాగండ్ల కోటి, దాదే అమృత, పల్లా రోజ్‌లీనా, రుద్రగాని శ్రీదేవి ఉపేందర్, దోన్‌వాన్ సరస్వతి రవి, కూరాకుల వలరాజు, పగడాల శ్రీవిద్య, తోట ఉమారాణి వీరభద్రం, పసుమర్తి రామ్మోహన్, బుర్రి వెంకట్, దండా జ్యోతిరెడ్డి, ముక్కాల కమల, తోట రామారావు, మాటేటి నాగేశ్వరరావు, మోతారపు సుధాకర్, చిరుమామిళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణను సత్కరిస్తున్న తాతా, సండ్ర

## నేటి నుంచి గ్రామసభలు

- లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహణ
- అధికారుల సమావేశంలో భద్రాద్రి కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 20 (నమస్తే తెలంగాణ): ఈ నెల 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర పథకాలను అమలులోకి తీసుకొచ్చేందుకు, లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మంగళవారం నుంచి ఈ నెల 24 వరకు గ్రామసభలను నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్.. అధికారులను ఆదేశించారు. ఈ సభల నిర్వహణపై అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందనతో కలిసి జిల్లాలోని ఆర్డీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులతో ఐడీవోసీ సమావేశ మందిరం నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామసభలకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఏ రోజున ఏయే గ్రామాల్లో/ వార్డుల్లో సభ నిర్వహించాలన్న ప్రణాళిక రూపొందించాలని సూచించారు. సభల వద్ద టెంట్లు, మైక్ సెట్లు, తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సభల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు అధికారులు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలపై ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. జడ్పీ సీఈవో నాగలక్ష్మి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రుక్మిణి, హౌసింగ్ పీడీ శంకర్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఏవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు దక్కేనా ?

- నాలుగు పథకాల అమలుకు సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వం
- నేటినుంచి నాలుగు రోజులపాటు గ్రామసభల నిర్వహణకు శ్రీకారం
- 'కోతల'తో కాంగ్రెస్‌పై నమ్మకం లేదంటున్న జనం
- పరిమితులతో పథకాల అమలు కష్టమేనంటున్న దరఖాస్తుదారులు

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 20 (నమస్తే తెలంగాణ): నాలుగు పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి గ్రామ సభలను ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఇప్పటికే కులగణన సర్వే ద్వారా కొంత సమాచారాన్ని సేకరించడంతోపాటు గత ప్రజాపాలన గ్రామసభల్లో సైతం సంక్షేమ పథకాల దరఖాస్తులను స్వీకరించింది. దీని ఆధారంగా పంచాయతీల్లో కుటుంబ సర్వేను ప్రారంభించారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు ఇచ్చేందుకు అర్హులను గుర్తించనున్నారు. ఇందుకోసం మంగళవారం నుంచి నాలుగు రోజులు జరిగే గ్రామసభల్లో అర్హుల జాబితాను ప్రదర్శించనున్నారు. ఇంతచేసినా అర్హులు ఇంకా చాలామంది ఉండనుండడంతో వారికి మొండిచెయ్యి చూపిస్తారా లేక మళ్లీ దరఖాస్తులు పెట్టుకునే అవకాశం ఇచ్చి మభ్యపడతారా అనే ప్రచారం జోరుగా సాగుతున్నది. సర్వేలకే పరిమితమైన ప్రభుత్వం ఈ నాలుగు పథకాలను అమలు చేయడం కష్టమేనని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తమకు నమ్మకం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


చంద్రుగొండ పంచాయతీ కార్యాలయంలో బారులుతీరిన దరఖాస్తుదారులు

### నేటినుంచి నాలుగు రోజులపాటు..

ప్రజాపాలనలో సైతం ప్రతిఒక్కరి వద్ద దరఖాస్తులు స్వీకరించి ఇప్పటికీ వారిలో ఒక్కరిని కూడా అర్హులుగా గుర్తించలేకపోయారు. అదే జాబితా ప్రకారం ఇప్పుడు కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, పింఛను పథకాలను ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇందులో అందరికీ ఇస్తారా లేక కొంత మందికే ఇస్తారా అనేది గ్రామసభల్లో స్పష్టత రానుంది. అందరికీ ఇవ్వడం కుదరదు అనే ప్రచారం మాత్రం అందరి నోటా వినబడుతున్నది. జిల్లావ్యాప్తంగా 481 గ్రామ పంచాయతీలతోపాటు నాలుగు మున్సిపాలిటీల్లో వార్డుల వారీగా గ్రామసభలను నిర్వహించనున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్, వ్యవసాయాధికారి, ఎంపీవోలు బృందాలుగా గ్రామాల్లో సభలు నిర్వహించనున్నారు. ఈ సభలను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ పర్యవేక్షించనున్నారు. ఈ సభల్లో చాలామంది లబ్ధిదారులు పథకాలు వస్తాయా రావా అని ఎదురు చూస్తున్నారు.

### తొలిరోజు 197 చోట్ల గ్రామసభలు..

భద్రాద్రి జిల్లాలో నాలుగు రోజులపాటు జరిగే గ్రామసభల కోసం ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీపీవో చంద్రమౌళి తెలిపారు. మొత్తం 481 పంచాయతీలకు గాను తొలిరోజు 168 పంచాయతీల్లో, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 29 వార్డుల్లో గ్రామసభలు జరుగనున్నాయి. వీటిని అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీఏవో బాబూరావు, జడ్పీ సీఈవో నాగలక్ష్మి పర్యవేక్షించనున్నారు.

### కొత్త రేషన్‌కార్డుల కోసం తిప్పలు

చంద్రుగొండ, జనవరి 20: కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుదారులు పడరాని పాట్లు పడుతున్నారు. కొత్తగా రేషన్ కార్డు పొందాలన్నా, ఇప్పటికే ఉన్న కార్డుల్లో చేర్పులు, మార్పులు చేసుకోవాలన్నా పంచాయతీ కార్యాలయాల్లో దరఖాస్తులు అందజేయాలంటూ కొన్ని గ్రామాల్లో అధికారులు సోషల్‌మీడియాలో విస్తృత ప్రచారం చేశారు. దీంతో చంద్రుగొండ మండలంలోని పలు పంచాయతీ కార్యాలయాల వద్ద సోమవారం ఉదయం నుంచే దరఖాస్తుదారులు బారులు తీరారు. ప్రజలు గుంపులుగుంపులుగా వచ్చి దరఖాస్తులు అందజేశారు. అయితే, గతంలో ప్రజాపాలన గ్రామసభల్లోనూ, ఇటీవలి కులగణన సర్వే సమయంలోనూ కొత్తరేషన్ కార్డుల కోసం దరఖాస్తులు అందజేశామని గ్రామస్తులు అంటున్నారు. మళ్లీ ఇప్పుడు మూడోసారి కూడా దరఖాస్తులు చేసుకోవాలనడం ఏంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు. మరి గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని నిలదీస్తున్నారు.